# కాలమ్ దాటని కథ (పేరు)

**–'శశి' , Fairlawn, NJ**

"అయ్యా!"

"ఏరా?" పేపర్‌లోంచి తలెత్తకుండానే గంభీరంగా ప్రశ్నించారు. ఆయనకు అయ్యా అన్న పిలుపులోని అర్థింపు అర్థం అయింది.

"అమ్మాయి పెళ్ళి చేస్తాన్నాం అయ్యగారూ. ఈ మూఢం ఎల్లగానే ముహుర్తాలు బాబూ."

"ఆ, రాజ్యం పెళ్ళన్నమాట. మంచిదే. కుర్రాడేంచేస్తున్నాడు?"

"మా సెల్లి కొడుకే బాబూ. సిన్నప్పటినుండి అనుకున్న సంవందమే. ఎదో మీలాంటి పెద్దల దయవల్ల కాలేజీ పాసు అయ్యాడు. ఐదేలు కడితే తాలుకాపీసులో గుమస్తా వుద్దోగం ఏయిస్తామన్నారండి. పెళ్ళి కర్సులకి నా పెళ్ళాంకాడ కొంతబంగారం, కూడేసిన డబ్బులు కొంచెం వున్నాయి బాబయ్యా...."

"మరింకేవోయ్. లక్షణంగా పెళ్ళిచేసెయ్యి. అదృష్టవంతుడివి బాధ్యత తీరిపోతుంది"

"మరేనండి. కాని సిన్న కొర్రొచ్చింది బాబు. వుద్దోగానికి కట్టాల్సిన డబ్బు మమ్మల్ని కట్టేమంటున్నారండి. కట్నాలు గట్రా అఖ్కర్లేదని ఉన్నడబ్బు సరిపోతుందని ముహుర్తాలు ఎట్టేసుకున్నాము..... అమ్మగార్ని అడిగితే మీకాడికి ఎల్లమన్నారు. మీరొక్క ఐదేలు సర్దితే పిల్ల మీపేఉ సెప్పుకొని కలకాలం సుకంగా వుంటాది. నాజీతంలోంచి బాకీ కోసుకుందురు బాబయ్యా"

"ఒరే నాదగ్గర ఉంటే సర్దనా. నీకు తెలీందేముంది? ఈ ఏడు పంటలు వరదల్లో కొట్టుకు పోయాయికదా...."

మాట పూర్తికాకముందే గేటు చప్పుడయింది. నలుగురయిదుగురు పెద్దలు లోపలికి వస్తే కనిపించారు.

"సరేకాని దమోదరంగారు వాళ్ళు వస్తున్నారు. నాలుగు కాఫీలు పంపమని అమ్మగారికి చెప్పు."' 'రండి రండి నమస్కారం. ఏంటి ఇలా దయచేశారు?"

"ఏముందండి ఉపోద్ఘాతం లేకుండా అసలు విషయానికి వచ్చేస్తాను. రాములవారి గుడిగోపురం ఎత్తించాలి మీకు తెలుసుకదా. మీ సహాయం కోసం వచ్చాము. ఏదో మీరు ఒక ఐదో, పదో సర్దితే గుడి నిలుస్తుంది. దానితోపాటు మీపేరు గుడిమీద శాశ్వతంగా నిలుస్తుంది. ఇదీ సంగతి" అన్నారు పంతులుగారు.

"అదికాదండి ఈ సంవత్సరం......" నసుగుతూ అన్నారు చౌదరిగారు.

"బాబ్బాబు మీరు అలా అనకండి. ప్రారంభోత్సవం మీచేత చేయించాలనుకుంటున్నాం. మా మేనల్లుడికి తెలిసిన ఒకరిద్దరు ప్రెస్ రిపోర్టర్లను కూడా పిలిపించాలనుకుంటున్నాం."దామోదరం గారన్నారు.

"ఏంటోన్నయ్యా తెగ మొహమాట పెట్టేస్తున్నారు. సరే అయితే ఒ పాతిక వేసుకోండి" అన్నారు చౌదరిగారు. కుర్చీలోనుండి క్రిందపడబోయి సర్దుకుని "ఏమిటీ వేలే' అన్నారు పంతులుగారు. మీసం దువ్వి చిరునవ్వు నవ్వారు చౌదరిగారు. కాఫీలు పూర్తిచేసి అప్పుడే అక్కడికి తిరిగివస్తున్న వరలక్ష్మిగారికి చౌదరిగారికి చెప్పివెళ్ళిపోయారు.

"అదేమిటండి, యిప్పుడే చంద్రం అడిగితే లేదన్నారు. వీళ్ళు ఐదో పదో అడిగితే పాతిక వేలన్నారు. పాపం వాడికీ ఏదో సర్దాల్సింది"అంది వరలక్ష్మి.

"వీడికిస్తే ఏమొస్తుందే, వాళ్ళకిస్తే పేరొస్తుంది."

"వాడుకూడా పదికాలాలపాటు మీ పేరుచెప్పుకుని బ్రతుకుతాం అన్నాడుకదండి. పాపం."

"పిచ్చిదానా, వాళ్ళకిస్తే నా పేరు గుడిగోడలమీద శాశ్వతంగా నిలిచిపోతుంది. పైగా ప్రెస్ వాళ్ళువస్తారు. నా పేరు పేపరులో వేస్తారు. వచ్చే ఎలక్షన్లకి మంచి పబ్లిసిటీ. వీడికిస్తే ఒ నలుగురికి నాలుగురోజులు చెప్పుకుంటాడు. అక్కడితో సరి. దానివల్ల వచ్చే పబ్లిసిటీవల్ల వీడిలాంటి మరో నలుగురు పాలేర్లు మాకూ సాయంచేయండి బాబూ అంటారు. యింక మనంకూడా వాడిలాగే అడుక్కుతినాలి. ఆపేరుకీ ఈ పేరుకీ తేడా లేదూ."

లోపల ఫర్నిచరు తుడుస్తూ వింటున్న చంద్రంకి మటుకు ఈ పేరుల్లోని మతలబు ఏమిటో అర్థం కాలేదు. ☆

## సుప్రసన్నమాట – నీతిపద్యములు

*ఆ॥వె॥ గుణము నెంచి చూడ కోటి కొక్కడనుండు*
*కులము వీధి వీధి వెలయుచుండు*
*గుణము మిన్నగాని కులము కానేరదు*
*వెన్నరీతి! సుప్రసన్నమాట!*

*ఆ॥వె॥ మంచి పద్యమందు మాధుర్యమును యెంచి*
*మనసు నిలుపుకొనగ మహిమ దెలియు*
*నీతి యహరహమ్ము జాతికి జీవమ్ము*
*వెన్నరీతి! సుప్రసన్నమాట!*

*ఆ॥వె॥ తల్లి, తండ్రి, గురువు దైవమై యలరారు*
*తల్లి పిదప తండ్రి దనరుచుండు*
*గురువులేని విద్య గుర్తింపునొందదు*
*వెన్నరీతి! సుప్రసన్నమాట!*

*ఆ॥వె॥ తల్లి ప్రేమయందు దాగిన యమృతమ్ము*
*కాంచగలమె? భువిని కనులతోడ*
*జనని మించు శక్తి జగతి గానగరాదు*
*వెన్నరీతి! సుప్రసన్నమాట!*

*ఆ॥వె॥ కాలమెల్ల వేళ కరిగి పోవుచునుండ*
*కాలమందు మనిషి కరుగవలదు*
*కష్టపడెడు వారి కాలమే బ్రోచును*
*వెన్నరీతి! సుప్రసన్నమాట!*

**–శేషం సుప్రసన్నాచార్యులు**
***Husnabad, AP***



